www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్



డ్రగ్స్‌పై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి - కడప : డ్రగ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవ ప్రాముఖ్యతను, నల్సా పథకం, 2015ను వివరించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రిజిస్టర్ మెడికల్ వైద్యాధికారి దగ్గరికి వెళ్లాలని సూచించారు. ప్రిస్క్రిప్షన్ ప్రకారం డ్రగ్స్ వాడాలి అని అన్నారు. డ్రగ్స్ మోతాదుకు మించి వాడడం హానికరం అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టిబి అధికారి ఎస్.రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, ఆర్ఎస్ కో-ఆర్డినేటర్ నాగరాజు, వైద్యాధికారి సావిత్రి, ఎన్ఎస్ఎస్ అధికారి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెదురుమదురు సంఘటనలు మినహా..
'ఉప' పోరు ప్రశాంతం



పులివెందుల కొత్తపల్లి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు

విభిన్న ప్రతిభావంతురాలిని వీల్‌చైర్ సాయంతో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు

ఒంటిమిట్ట రాచపల్లి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

- ఒంటిమిట్ట, పులివెందుల్లో హై..టెన్షన్
- పులివెందులలో టిడిపి స్వైరవిహారం
- ఒంటిమిట్టలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బెదిరింపులపై వైసిపి నిరసన
- ఎంపీ, టిడిపి ఎమ్మెల్సీ అరెస్టు, విడుదల
- కడప ఎంపీ కార్యాలయానికి డిఐజి, ఎస్‌పి
- పులివెందులలో 76.44, ఒంటిమిట్టలో 70.33 శాతం పోలింగ్



ఓటు వేసేందుకు వస్తున్న విభిన్నప్రతిభావంతుడు



పులివెందులలో అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ఉద్రిక్త వాతావరణం మధ్య ముగిశాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో కడప జిల్లా అధికార యంత్రాంగం మంగళవారం ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పకడ్బందీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించింది. పులివెందులలో 76.44, ఒంటిమిట్టలో 70.33 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్‌కు ముందే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అరెస్టు, మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ ఎస్.వి.సతీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. కడప, ఎర్ర గుంట్ల పట్టణ ప్రాంతాలకు తరలించారు. ఎంపీ ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా బైఠాయించారు. ఒంటిమిట్ట, పులివెందుల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో బెదిరింపులు, దొంగఓట్లు, ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలు, నిరసనలు, బైఠాయింపులు, టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వివాదాలతో ఉత్కంఠ నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని వైసిపి జిల్లా నాయకులను అదుపులోకి తీసుకోవడంతో ఒకసారిగా వాతావరణం వేడెక్కింది. పులివెందుల పరిధిలోని మోట్నూతలపల్లి, ఎర్రిపల్లి, కణంపల్లి గ్రామాల్లో టిడిపి దౌర్జన్యాలకు, దారుణాలకు పాల్పడింది. ఓటర్ల దగ్గర నుంచి స్లిప్పులు లాక్కొని ఓట్లు వేసుకుని. జిల్లాలోని జమ్మలమడుగు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు దొంగఓట్లకు పాల్పడ్డారు. ఒంటిమిట్ట పోలింగ్ బూత్‌లోని వైసిపి ఏజెంట్‌పై దాడులు, దౌర్జన్యాలు, బూత్‌లో ఇరు పార్టీల కార్యకర్తల మోహరింపుతో కొంతసేపు పోలింగ్ నిలిచి పోయింది. చిన్నకొత్తపల్లి బూత్‌లో వైసిపి ఏజెంట్‌పై టిడిపి దాడికి పాల్పడ్డారు. సాలాబాద్, నడింపల్లి, మంటపంపల్లి, చింతరాజుపల్లి పంచాయతీ గాండ్లపల్లి పోలింగ్ బూత్‌లో వైసిపి, టిడిపి ఏజెంట్లు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలింగ్ పర్యవేక్షణకు వచ్చిన జాయింట్ కలెక్టర్ అతిధిసింగ్‌కు వైసిపి అభ్యర్థి ఇరగంరెడ్డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఏజెంట్లను, చివరికి తనను సైతం బెదిరించి, అప్రజాస్వామిక ఎన్నికలకు కారణమయ్యారని వివరించారు. రీపోలింగ్ నిర్వహించాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన చేశారు. చిన్నకొత్తపల్లి బూత్ పరిశీలన అనంతరం వెళ్తున్న మంత్రిని స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్ర నాధరెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు స్పందించి మంత్రి స్థాయిలో ఉంటూ ఇటువంటి అప్రజాస్వామిక వైఖరేమిటని నిలదీశారు. అనంతరం వైసిపి జిల్లా నాయకత్వం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కడప-తిరుపతి రహదారిపై బైఠాయించింది. ట్రాఫిక్ స్తంభించింది.

పులివెందులలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక ఉద్రికత్త వాతావరణం కొనసాగింది. ఈ ఎన్నికను తెలుగుదేశం, వైసిపి రెండూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నిక టెన్షన్...టెన్షన్‌గా మారింది. మంగళవారం తెల్లవారుజామున ఎంపీ అవినాష్‌రెడ్డిని, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కడపకు తరలించారు. పులివెందులకు వచ్చిన ఎంపీ అవినాష్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలని కర్నూల్ రేంజి డిఐజి ప్రవీణ్, ఎస్‌పి అశోక్‌కుమార్ కోరారు.

ఎక్స్‌ట్రాలు చేస్తే కాల్చి పడేస్తా. : డిఎస్‌పి

ఎక్స్‌ట్రాలు చేస్తే కాల్చి పడేస్తానంటూ వైసిపి కార్యకర్తలకు పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు ఎంపీ అవినాష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. తర్వాత ఎంపీ పులివెందులలోని తన కార్యాలయంలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ అవినాష్‌రెడ్డిని కలిశారు. భద్రతా కారణాల దృష్ట్యా వైసిపి కార్యకర్తలను ఆఫీస్ ఖాళీ చేయాలంటూ డిఐజి ఆదేశించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ వైసిపి కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు వైసిపి కార్యకర్తలైతే తనది ఖాకీ యూనిఫామ్ అని, ఎక్స్‌ట్రాలు చేస్తే కాల్చి పడేస్తానంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రశాంతంగా ఎన్నికలు : డిఐజి

జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించామని డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలు పరిశీలించామని చెప్పారు. ఎక్కడ ఎటువంటి సంఘటన చోటు చేసుకోలేదన్నారు. కణంపల్లెలో 20 మంది మహిళలను దగ్గరుండి ఓటు వేయడానికి పంపించామని పేర్కొన్నారు. రిగ్గింగ్ జరిగినట్లు ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ఉప ఎన్నికల్లో ఓటర్ల దగ్గర స్లిప్పులు లాక్కొని టిడిపి గుండాలే ఓట్లు వేశారని, ఇవి చెత్త ఎన్నికలు అని, కర్నూలు రేంజ్ డిఐజి ప్రవీణ్, ఎస్‌పి అశోక్ కుమార్ టిడిపి కార్యకర్తలుగా వ్యవహరించాలని, ఎన్నికల జరిగిన విధానంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఎంపీ అవినాష్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌కు రావాలని డిఐజి తన కార్యాలయానికి వచ్చి కోరారని పేర్కొన్నారు. తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఒక లేఖలో సంతకం పెట్టమని అడిగారన్నారు. ఆ లేఖలో పోలీసులు ఎన్నో అసత్యాలు రాశారని అందుకు తాను సంతకం పెట్టడానికి నిరాకరించానని చెప్పారు. కణంపల్లెలో ఓటర్లు కాళ్లు పట్టుకున్నా అధికారులు ఓటు వేయనీయలేదని చెప్పారు.



పులివెందులలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

టిడిపి పతనానికి నాంది : వైసిపి

వేంపల్లె : పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిని వేంపల్లెలో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజల హక్కులను కాపాడే అధికారులే మౌనంగా వహించడం శోచనీయమని, ఈ ఎన్నికలు టిడిపి పతనానికి నాదన్నారు. పులివెందుల నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు వేల సంఖ్యలో వచ్చి ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో తిష్ట వేసి అ గ్రామస్తులనే భయబ్రాంతులకు గురిచేస్తుంటే అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహించడం శోచనీయమని వాపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులను కాపాడే బాధ్యత పోలీసులు, కలెక్టర్, జిల్లా అధికారులపై ఉందన్నారు.

రీపోలింగ్ నిర్వహించాలని ఎంపీ అవినాష్ ధర్నా

ఎర్రగుంట్ల: పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని దొంగ ఓట్లు వేశారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసి కడపకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి ఎర్రగుంట్లకు తరలించారు. నిడిజివ్విలోని సుధీర్‌రెడ్డి నివాసానికి ఎంపీ అవినాష్‌రెడ్డి వెళ్లారు. అక్కడి నుంచి ఉదయం 10:30 సమయంలోఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వరకు ఐదు కిలోమీటర్ల మేర ఎంపీతోపాటు కార్యకర్తలు, నాయకులందరూ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా కూడలిలో ఎంపీ మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉపఎన్నిక పోలింగ్ బూతులలో తమ ఏజెంట్లను కూడా కూర్చొని ఇవ్వలేదన్నారు. పోలీసులందరూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, జడ్‌పిటిసి బాలయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు కల్పించండి

జడ్‌పిటిసి ఉప ఎన్నికల సంబంధించి అచ్చువెళ్లి, ఎర్రిపల్లె, కనంపల్లి, ఇతర గ్రామస్తులు తమకు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును కల్పించాలని ఎన్నికల అధికారికి వినతి పత్రం అందించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయానికి చేరుకుని ఎఆర్ఓ కృష్ణమూర్తికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు, పోలీసులు అడ్డుకుని తమ ఓటు వారే వేశారని ఓటు హక్కు కల్పించాలని వినత పత్రంలో పేర్కొన్నారు. తిరిగి రీపోలింగ్ నిర్వహించాలన్నారు. ఇతర మండలాల నాయకులు వచ్చి దొంగ ఓట్లు వేశారని ఎంపీ అవినాష్‌రెడ్డికి కూడా తమగోడును విన్నవించుకున్నారు.

40 ఏళ్లల్లో ప్రజల ఓటుకు స్వేచ్ఛ : మంత్రి సవిత

పులివెందుల రూరల్: వైసిపి హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిచిందని, ప్రస్తుతం రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కొనసాగుతోందని, 40 ఏళ్ల పులివెందుల చరిత్రలో కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల ఉప ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి లేని పోనీ ఆరోపణ చేయడం అర్థ రహితమన్నారు. ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం కణంపల్లిలో వైసిపి గుండాలు టిడిపికి చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేసి కార్యకర్తలను గాయాల పాలు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో టిడిపి తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్త చైతన్యరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పేర్ల పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు.

రెండు స్థానాలు టిడిపివే : మంత్రి మండిపల్లి

కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలను టిడిపి కైవసం చేసుకుంటుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడపలోని ఓ హోటల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము ప్రజలను కోరామని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం తెలంగాణకు వెళితే, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు జడ్‌పిటిసి స్థానాలు గెలిచి సిఎంకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. టిడిపి కార్యకర్తకు ఆపద వస్తే పార్టీ తరపున తాము ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు చూడని గ్రామాలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాయని పేర్కొన్నారు. విజయం సాధించడం తథ్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కాయని ఇళ్ల వద్దకు పోయి బెదిరించాలని, ఏజెంట్లుగా కూర్చోకుండా భయపెట్టారని చెప్పారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా టిడిపి విజయం సాధ్యమని తెలిపారు.



ఎర్రగుంట్ల : ధర్నా చేస్తున్న ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి



వేంపల్లె : ఇడుపులపాయ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోవిడ్-19 అడిషనల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అడిషన్ కార్మికులు కార్పొరేషన్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ ప్రచారం కోసం కోట్లు ఖర్చు పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తుందని పేర్కొన్నారు. దినసరి కూలి కేవలం నెలకు రూ.12వేలు అడిషనల్ కార్మికులకు చెప్పి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. వారి కష్టాన్ని అతి తక్కువ వేతనంతో వివిధ రకాల పేర్లతో దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో కార్మికులు మహేష్ నాయక్, నాగరాజు, బర్న, దాసు, సురేష్, మహేష్ బాబు, శివ, నిత్య పూజయ్య, సాయి, కెజయ్య, మహిళా కార్మికులు నాగలక్ష్మి, గంగాదేవి, సంపూర్ణమ్మ, ఈశ్వరి, సుజనమ్మ, సారమ్మ, సుమ లత, జానకి కూర్చున్నారు.

పుల్లయ్య మరణం కళారంగానికి తీరని లోటు

ప్రజాశక్తి - కడప అర్బన్ : చెక్కభజన,కులుకు భజన, జడకోపు, కోలాటాల్లో అత్యంత నిపుణులుగా ప్రసిద్ధి చెందిన సగిలి పుల్లయ్య మరణం కళాకారులకు తీరని లోటని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల మరణించిన చెక్కభజన కళాకారుడు పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లయ్యకు అమోఘమైన జ్ఞాపకశక్తి ఉందని, వేలాది పాటలు పాడేవారని చెప్పారు. అనేక రాష్ట్రాల్లో, అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ మొదలైన దేశాల్లో చెక్కభజన ప్రదర్శనలిచ్చి మన జిల్లా కీర్తిని వ్యాపింపజేసిన ఘనత పుల్లయ్యకే దక్కుతుందన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం కడప రిమ్స్‌లో మంగళ వారం అన్నదానం నిర్వహించారు. కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ 2020, నవంబర్ తమ తండ్రి మరణించారని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం 2024, నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాకు సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన వారికి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.



విద్యార్థిని హేమలతకు ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్ట్ చైర్మన్

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- వల్లూరు

స్థానిక ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థిని బి. హేమలతకు కెఎస్ఆర్ఎంటెక్ విద్యార్థుల సహకారంతో తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 25 వేల చెక్కును అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో హేమలతకు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె. శ్రీనివాసులు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన హేమలతకు బిటెక్ చదవడానికి ఇప్పటి వరకు రూ. 63 వేల సాయం అందించినట్లు తెలియజేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన సి.వి సురేంద్ర, సాయి ప్రసాద్ ఉపాధ్యాయుల చొరవతో హేమలత గురించి ట్రస్ట్ వారితో చెప్పడంతో స్పందించి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చామన్నారు. విద్యార్థులకు సహాయాన్ని అందిస్తున్న ట్రస్టు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

'స్వామి వివేకా'ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు అన్నారు. భారత ప్రభుత్వ క్రీడ మంత్రిత్వ శాఖ, మై భారత్(నెహ్రూ యువ కేంద్రం), కడప శాఖ, హ్యాండ్ 4 యు ఆర్గనైజేషన్ సమీక్ష ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీలో నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథిగా స్టెప్ మేనేజర్ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూమంచి కార్యక్రమాలు చేపట్టి దేశానికి ఒక వెన్నుముకలాగా నిలబడాలని అన్నారు.

తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు

పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జెఎసి చైర్మన్, ఎపి ఎన్‌జిఓ బద్వేల్ తాలూకా అధ్యక్షులు టి.నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపో గేట్ వద్ద జాతీయ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లా డుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను తక్షణమే చెల్లించాలని కోరారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ డిపో తరలించడం వెంటనే ఆపాలని అన్నారు. సుమారు సంస్థలో 8 వేల ఖాళీలున్నాయని వాటిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జాతీయ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రావు మాట్లాడుతు నాలుగు ఏళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్‌లను వెంటనే కలిపించాలన్నారు. ఇహెచ్ఎస్ స్థా నంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు శివరామిరెడ్డి, మజ్దూర్ యూనియన్ నాయకులు చిన్నప్పరెడ్డి, చంద్రయ్య, శ్రీధర్, కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ధర్నాలో పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-చెన్నూరు

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నియామకమైన ముళ్ళ శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం చెన్నూరు మండలం ఓబులంపల్లిలో తన నివాసంలో టిడిపి, బిసి నాయకులు, కార్యకర్తలు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. శ్రీనివాసులురెడ్డిని సన్మానించిన వారిలో టిడిపి మండల నాయకులు అల్లాడు రాజశేఖర్‌రెడ్డి. జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం. యువ నాయకుడు మహేశ్వర్ రెడ్డి. ఐటిడిపి సమన్వయకర్త యామల మణికంఠ పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పనిచేసే ప్రతి నాయకునికి ప్రతి కార్యకర్తకు విలువలు ఉంటాయని వారన్నారు. శ్రీనివాసులు రెడ్డిని చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డికి, కమలాపురం శాసనసభ్యుడు. పుత్తా కృష్ణ చైతన్యరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-కాశినాయన

ప్రస్తుత సమాజంలో క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ డి. రూతు ఆరోగ్య మేరీ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి విద్యార్థినీ చక్కగా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థా నాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ప్రపంచ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో హాజరై ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్. మెర్సీరాణి పిహెచ్ఎన్ శారద. ఇతర ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో జరిగేది ప్రజాస్వామ్యం పాలనా.. లేక నియంత పాలన అనే అనుమానం వ్యక్తమవుతోందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల ఓటింగ్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, అధికారంతో ఓటింగ్ రాకుండా అడ్డుకుని రిగ్గింగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. తాను ఇంతవరనకు ఇలాంటి ఓటింగ్ వ్యవస్థను చూడలేదన్నారు. కనీసం ప్రజలకు ఉన్న ఓటు హక్కును సద్వినియోగం చేసుకోకుండా దారుణమైన పరిస్థితులు నెలకొనడం బాధాకరమని వాపోయారు.

రాహుల్ గాంధీ అరెస్టు అక్రమం

ప్రజాశక్తి - కడప

రాహుల్ గాంధీ అరెస్టు అక్రమం అని కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్.ఎ. సత్తార్ అన్నారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద 'నిరసన ధర్నా' చేయటానికి ప్రయత్నించగా ఉప ఎన్నికల కారణంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మద్దిలేటి సిబ్బందితో అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందన్నారు. అనంతరం పార్టీ ఆఫీసుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బయట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాసిర్ ఖాన్ ,కోటపాటి లక్ష్మయ్య ,జాకీర్ పాల్గొన్నారు.



నీరు లేక వెలవెలబోతున్న పలుగురాళ్లపల్లె చెరువు, బీడుగా ఉన్న చెరువు ఆయకట్టు

పలుగురాళ్లపల్లి చెరువుకు నీరు చేరేదెన్నడో..!

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని పలుగురాళ్లపల్లె చెరువుకు నీరు ఎప్పుడు చేరుతుందోనని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తునానరు. నీరులేక చెరువు వెలవెలబోతోంది. కూతవేటు దూరంలో బ్రహ్మసాగర్ ఉన్నప్పటికీ చెరువులో నీరులేదు. ఆ చెరువు కింద దాదాపు 120 ఎకరాల భూమిని రైతులు వరి సాగు చేసుకోలేక బీడుగా పెట్టుకుంటున్నారు. అన్నిచోట్ల వరి నాట్లు వేసి పచ్చగా పైరు ఉంటే.. పలుగురాళ్లపల్లె చెరువు ఆయకట్టు బీడుగా దర్శనమిస్తోంది. అవసరం ఉన్న సమయానికి బ్రహ్మసాగర్ నుండి నీళ్ల అందడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవి సమయంలో వృథాగా నీళ్ల వదులుతారు తప్ప, రైతులకు అవసరమైన సమయంలో వదలడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిచాలని రైతులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పుణ్యక్షేత్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో మద్యం అమ్మకాలు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ అందుకు తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా పుణ్యక్షేత్రంలో మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. స్వామివారికి పూజా వస్తువులు దొరుకుతాయా లేదో తెలియదు కానీ బ్రహ్మంగారిమఠంలో మద్యం మాత్రం పుల్లుగా అందుబాటులో ఉంది. అనేకసార్లు బెల్టషాప్ యాజమానులను పోలీస్ అధికారులు పిలిపించి మందలించినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం సేవించినవారు నడిరోడ్లపై పడిపోతున్నారు. ఇక్కడికి వచ్చిన భక్తులు, యాత్రికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి మఠంలో అమ్మకాలను పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆది'ని నమ్ముకుంటే ఇబ్బంది పడేది మీరే..!

- వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డిని నమ్ముకుని టిడిపి నాయకులు దౌర్జన్యం చేస్తే ఇబ్బంది పడేది మీరేనని, ఆయన కాదని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఆదినారాయణరెడ్డి రాష్ట్రం వదిలి వెళ్లిపోవడం ఖాయమని అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో ఓటర్లకు భయపడి కూటమి ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నారని తెలిపారు. జమ్మలమడుగు నుంచి పులివెందులలో జరిగే ఎన్నికలకు వెళ్లి పోలింగ్ కేంద్రాలలో నిలబడడం సిగ్గుచేటన్నారు. పోలింగ్ కేంద్రాలలో చాలా స్పష్టంగా ఫోటోలలో వీడియోలలో కనపడుతున్నారని తెలిపారు. కూటమి నాయకులు పులివెందులలో ఉంటే వైసిపి ఎంపీ, స్థానికనేత వైఎస్ అవినాష్‌రెడ్డిని ఇంటి నుంచి బయటకు పంపివేయడం ఏమిటని ప్రశ్నించారు. 2029లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎం కావడం ఖాయం.. ఆదినారాయణరెడ్డి రాష్ట్రం వదిలి వెళ్లడం ఖాయం అని చెప్పారు. సమావేశంలో చిన్న కొమెర్ల జగదీశ్వర్‌రెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, గజ్జల లక్ష్మయ్య, మలికిరెడ్డి హనుమంత్ రెడ్డి, నవాబుపేట శివభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హెచ్ఐవి పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యురాలు సాగర కుమారి సూచించారు. మంగళవారం ఎపి ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపు ర్యాలీని ఏర్పాటు చేశారు. ర్యాలీని ప్రభుత్వ వైద్యురాలు సాగర కుమారి ప్రారంభించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల విద్యార్థులు, సామాన్య ప్రజానీకంలో అవగాహన అనేది అవసరమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వైద్యనాథ్, సిడిఎస్ పుష్పరాజు, సుభాషిణి, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ఆశ వర్కర్, సిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ ఒక భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, లైబ్రేరియన్, భారతదేశంలో లైబ్రరీ సైన్స్ పితామహుడని జమ్మలమడుగు గ్రంథాలయ శాఖ అధికారులు నాదెండ్ల బాబ్జి తెలిపారు. మంగళవారం సాయంత్రం జమ్మలమడుగు ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర పితామహులు, పద్మశ్రీ డాక్టర్ రంగనాథ్ 133వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి ఎస్.అమీర్‌బాషా, వెంకటేశ్వరరెడ్డి, బండి ఆత్మకూరు మనోహర్‌రెడ్డి, కుండా భాస్కర్, డాక్టర్ నరసింహులు, కవల రామయ్య, తిరుపతిరెడ్డి, వంకం పద్మనాభం, చాంద్‌బాషా, నారాయణ, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, వేపరాల లైబ్రేరియన్ బాల చంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుదాం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ జమున

ప్రజాశక్తి- కడప సిటీ

ప్రభుత్వ వైద్య కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుదామని ప్రిన్సిపల్ టి. జమున పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించిన నేపథ్యంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి సీనియర్ విద్యార్థి జూనియర్‌లను సోదర,సోదరి భావంతో చూసి, వారిని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. కడప వైద్య కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా నిలబెట్టడం అందరి బాధ్యత చెప్పారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కోసం ర్యాగింగ్ ఘటనలకు దూరంగా ఉండి, సఖ్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ లక్ష్మీ నరసమ్మ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధిపతి డాక్టర్. సునీల్ కుమార్ రెడ్డి, అనస్థీషియా విభాగ అధిపతి డాక్టర్. సునీల్ చిరువెల్ల, డాక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్, వైద్యులు

మురుగు కాలువకు లెట్రిన్ పైపులు అనుసంధానం

ప్రజాశక్తి - ముద్దనూరు



మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన మురుగు కాలువకు కొందరు తమ ఇళ్లలోని లెట్రిన్ పైపులు కనెక్షన్ ఇచ్చారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ లేకుండా పారేందుకు రోడ్డుతోపాటు మురుగు కాలువ ఏర్పాటు చేశారు. స్నానాల గదిలో బాత్రూం నీరు, దుస్తులు ఉతికిన నీరు వదిలినా పర్వాలేదు.. కానీ కొందరు వారి ఇళ్ల వద్ద అక్రమంగా పైపు కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని కాలువలోకి లెట్రిన్ నీళ్ల వదులుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా పైప్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. లెట్రిన్ నీరు కాలువలో వదలడంతో దుర్గంధం వెదజల్లుతోందని పలువురు వాపోతున్నారు.

మురుగు కాలువకు పైప్ కనెక్షన్ అనుమతి లేదు..

మురుగు కాలువకు పైప్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అనుమతి లేదు. పంచాయతీ అనుమతి లేకుండా పైప్ కనెక్షన్లు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇచ్చిన కనెక్షన్లు వెంటనే తొలగిస్తాం.

- లక్ష్మీ నరసింహులు, కార్యదర్శి, ముద్దనూరు

నులి పురుగులను నివారిస్తే పిల్లల్లో ఎదుగుదల



నులిపురుగు నివారణ మందులు వేస్తున్న డాక్టర్ శ్రీవాణి

ప్రజాశక్తి - చాపాడు

పిల్లల్లో నులిపురుగులను నివారిస్తే వారిలో ఎదుగుదల ఉంటుందని వైద్యులు సూచించారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలో మంగళవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, కావ్య మాధురి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. వీటిని వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయన్నారు. సిబ్బంది ప్రతి ఒక్క విద్యార్థికి నులిపురుగు నివారణ మందులు అందజేయాలని సూచించారు. మండల పరిధిలో 6,728 మందికి వేయవలసి ఉండగా 6,519 మందికి పూర్తి చేశామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ డీ.సుకన్య, సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, ప్రసాద్, లక్ష్మిదేవి, భవాని, ఉపాధ్యాయులు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు : ఆల్బెండజోల్ మాత్రలు నులిపురుగులను నివారిస్తాయని ఎంపిడిఓ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వై.ప్రసాద్ యాదవ్, హెడ్ మాస్టర్ ఓబులేసు, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులురెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, సూపర్‌వైజర్లు జయమ్మ, విశాలక్ష్మి, లక్ష్మి రామారావు, జైకర్, రమణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : ఏడాది వయసు పైబడిన ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకోవాలని వైద్యాధికారి ముబీన్ సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసు వచ్చిన వారందరూ తప్పక మాత్రలు వాడాలన్నారు. నులిపురుగులు ఉండడం వల్ల ఆకలి మందగిస్తుందన్నారు.

ప్రొద్దుటూరు : ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై దృష్టి పెట్టి చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని శాసనమండలి మాజీ సభ్యులు డాక్టర్ బచ్చల పుల్లయ్య సూచించారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ హ్యాండ్ వాష్ గురించి వివరించారు. సొసైటీ అధ్యక్షులు ఎన్‌వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

వేంపల్లె: కడుపులో నులి పురుగులు ఉంటే చిన్న పిల్లలకు కడుపు వస్తుందని, దాని నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు పృథ్వీ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సంసిద్ పాఠశాలలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేర్వేరుగా విద్యార్థులకు నులిపురుగులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, పీడీ తేజేంద్ర, సంసిద్ పాఠశాల ప్రిన్సిపల్ పరిమళాదేవి, సిహెచ్ఓ బసవయ్య, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో బీరం విద్యాసంస్థల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి

జాతీయ స్థాయిలో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్తనెల్లూరు సమీపంలో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల కళాశాల విద్యార్థులు ఎన్.సుదీప్‌రెడ్డి, వెంకటకార్తిక్ ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గౌహతి-అస్సాం వారు అంతర్జాతీయ పాఠశాల ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జాతీయస్థాయిలో విద్యార్థులు మూడవ ర్యాంకు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం మంగళవారం తెలిపింది. ఐఐటి గౌహతి ఇనిస్టిట్యూట్‌లో జరగబోయే మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సాధించాలన్న ఆలోచన విద్యార్థుల్లో ఉన్నంతవరకు ఎలాంటి అడ్డంకులు వచ్చినా విజయాన్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద కామ్రేడ్ అరవింద్ అధ్యక్షతన జెండాను మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్, అరవింద్ రాజశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట ఉద్యమంలో విద్యార్థుల పోరాటాలు చాలా కీలకమైనవని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది విద్యార్థులు అమరులయ్యారని గుర్తు చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతిని రద్దు చేస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు తీసుకొచ్చిన అప్రజాస్వామిక ఉత్తర్వులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల పక్షాన విద్యార్థి సంఘాల పక్షాన ఉండాలని, లేనిపక్షంలో పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, వీర, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కెనరా బ్యాంక్‌ను మార్చాలి : డివైఎఫ్ఐ



బ్యాంక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకును పెద్ద భవనాల్లోకి మార్చాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆ మేరకు ఆయన మంగళవారం బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల సౌకర్యార్థం ఇతర చోటుకు మార్చాలని కోరుతూ కెనరా బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కెనరా బ్యాంకు చిన్నదిగా ఉండడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారని తెలిపారు. ఒక్కటే క్యాష్ కౌంటర్ ఉండడంతో గంటల తరబడి వృద్ధులు, మహిళలు లైన్‌లో వేచి ఉండే పరిస్థితి ఉందన్నారు. ఫ్రీ ఎగ్జిట్ దారి కూడా లేదన్నారు. రద్దీ ఎక్కువ దృష్ట్యా దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో కెనరా బ్యాంకులో దొంగతనాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఖర్చు తగ్గుతుంది



పొలాన్ని పరిశీలిస్తున్న జెడి బి.చంద్రనాయక్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భూసార పరీక్షల వల్ల రైతుకు రసాయనిక మందులు ఖర్చు తగ్గుతుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఎఒ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చంద్ర నాయక్ వివిధ రకాల పంటలకు సంబంధించిన సూచనలిచ్చారు. అలాగే మైలవరం మండలం దొమ్మర నంద్యాలలో కూడా ఎఒ గురుభాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, ఉప్పలపాడు గ్రామ రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట సాగు చేసే సమయంలో రైతులు కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారి దేవి పద్మలత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గాంధీనగరం, ఓబుల్‌రెడ్డి పేట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలి బాటలు తీసుకోవడం వల్ల పైరుకు గాలి బాగా ప్రసరించి దోమలు వృద్ధి చెందవని తెలిపారు. రైతులకు పసల్‌బీమా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వరి నారు మడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎఇఒ స్వప్న, విఎఎ రాము, అంజలి రైతులు పాల్గొన్నారు.

ప్రతి పంటనూ నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ ఎస్.అశోక్ రెడ్డి సూచించారు. వి.రాఘవాపురం గ్రామంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ విత్తనాలు సాగు చేసేటప్పుడు ట్రయికోడెర్మా విరిడీతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే ఖర్చు తక్కువ, దిగుబడులు ఎక్కువ సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులతో భూమి సారవంతం కోల్పోతుందని వివరించారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడిఎ, ఎఒ, రైతులు



ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

పొంగి ప్రవహిస్తున్న కుందూ నది

ప్రజాశక్తి - చాపాడు

స్థానికంగా, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి కుందూ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదిలో నీటి ప్రవాహం అధికమైంది. ప్రస్తుతం నీరు మండల పరిధిలోని అన్నవరం, అల్లాడుపల్లె బ్రిడ్జిలను తాకుతున్నాయి. కుందూ అనుసంధాన వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదిలో ప్రస్తుతం 15వేల క్యూసెక్కులకుపైగా నీరు ప్రవహిస్తోంది. నది తీర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రమాకుమారి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అవగాహన కల్పించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అన్నవరం, సీతారాంపురం గ్రామాల వద్ద కుందూనదిపై ఉన్న బ్రిడ్జిల వద్ద సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

భుజాలు తడుముకున్నట్లుంది ఎన్నికల కమిషన్ వాలకం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

గుమ్మడి కాయ దొంగంటే భూజాలు తడుముకున్నట్లుంది ఎన్నికల కమిషన్ తీరని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణవాయువులాంటిది అన్నారు. అలాంటి ఎన్నికలకు సక్రమమైన, సమగ్రమైన ఓటర్ల జాబితా అనేది అతి ప్రధానమైన అంశమన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయాని వాటిని సరిదిద్దండి అని కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వాన దాదాపు 300 మంది ఎంపీలు ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ వద్దకు వెళితే.. ఎన్నికల కమిషన్ అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాహుల్ గాంధీని, ఆయన వెంట వెళ్లిన ఎంపీలను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఇది అప్రజాస్వామికం, పిరికిపంద చర్య అన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకపోతే ఎన్నికల కమిషనర్ ఎందుకు రాహుల్ గాంధీ గారిని కలవాలంటే భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో అనుమానాలు ఉన్నాయని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, వివిధ రాజకీయ పార్టీల పెద్ద నాయకులు, విశ్లేషకులు, సాంకేతిక నిపుణులు వివిధ సందర్భాల్లో అనుమానాలు వ్యక్తం చేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ స్థానంలో బ్యాలెట్ పేపర్ పెట్టాలని అని అడుగుతున్నట్లు చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే మదన్ మృతి బాధాకరం

రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1995లో తాను రాజంపేట జడ్‌పిటిసి సభ్యునిగా, జడ్‌పి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేందుకు మదన్ మోహన్‌రెడ్డి ఎంతో సాయం చేశారని తెలిపారు. 1989-94 మధ్య కాలంలో రాజంపేట నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ముక్కుసూటి మనస్తత్వంతోపాటు నీతికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం మదన్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా గౌరిదేవి మంగళ వ్రతం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక సంఘం వీధిలో వెలిసిన గౌరిదేవి ఆలయంలో మంగళ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళా మండలి బలిజ సంఘం, ఆకుతోట సంఘం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శంకర మంచి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిలలు సామూహిక పూజలు చేశారు. అనంతరం కొత్తూరు వరలక్ష్మి, జగన్‌మోహన్ దంపతులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారామ్, మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలమ్మ, మహిళలు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు



నవోదయ పాఠశాలకు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. రాజుపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన అక్షయ్ కుమార్, చాపాడు గాయత్రి పాఠశాలకు చెందిన షణ్ముఖ విఘ్నేశ్‌రెడ్డి నవోదయ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతికి ప్రవేశాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ తరఫున విద్యార్థులను అభినందించారు.

ముద్దనూరులో ఆధార్ సేవలు పునఃప్రారంభం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ గ్రామ పంచాయతీ సచివాలయం-1లో ఆధార్ సేవలు పునఃప్రారంభించినట్లు మంగళవారం ఎంపిడిఓ పరిపూర్ణ అరుంధతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజూ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరు-కర్నూలు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్‌పై వెళుతున్న ఓ వ్యక్తి దుర్మరణం పొందాడు. కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు బి.మఠం మండలం నరసన్నపల్లి గ్రామానికి చెందిన సురసుర రమణయ్య (45)గా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రమణయ్య తన స్కూటర్‌పై వెళుతుండగా, వేగంగా వస్తున్న కారు, బైక్ అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రమణయ్య బి.మఠం మండలంలోని చెంచయ్యగారిపల్లె లైన్‌మెన్‌గా విధులను నిర్వహిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో నరసన్నపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. రమణయ్య మృతి పట్ల గ్రామ ప్రజలు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.



మృతి చెందిన లైన్‌మెన్ రమణయ్య, దెబ్బతిన్న కారు ముందు భాగం